సాక్షి చిత్తూరు

శుక్రవారం । 14 । జూన్ । 2024



'భౌ..భౌ.. ఎక్కడో..?

ఓ వ్యక్తి తనకు ప్రియమైన శునకాలు చోరీకి గురి కావడంతో నిద్రాహారాలు మాని వాటి కోసం అన్వేషిస్తున్నాడు. - 8లో



పంటలపై ఆగని ఏనుగుల దాడి

పంటలపై ఏనుగుల దాడి కొనసాగుతూనే ఉంది. గురువారం సైతం మరోసారి పంటలపై స్వైరవిహారం చేశాయి. - 8లో



అంతా కల్తీమయం

జిల్లాలో ఆహార పదార్థాల కల్తీ జోరందుకుంది. పప్పు దినుసులు, టీపొడి, నూనెలు మొదలైన వాటిలో ఈ కల్తీ ఎక్కువగా ఉంటోంది. - 8లో

న్యూస్‌రీల్

వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లు

పుంగనూరు: పట్టణంలో నూతన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నజీర్ అహమ్మద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణంలోని శుభారాం డిగ్రీ కళాశాలలో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారని, వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో చేరదలచిన వారు దరఖాస్తులను ఈనెల 20వ తేదీ లోపు ఇవ్వాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఎల్‌ఈడీ హాల్‌టికెట్లు తీసుకోండి

చిత్తూరు కార్పొరేషన్: డీఎల్‌ఈడీ 4వ సెమిస్టర్ 2022–24 బ్యాచ్ రెగ్యులర్ విద్యార్థులకు ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

అవగాహనతోనే క్యాన్సర్‌కు దూరం



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్(కాణిపాకం): అవగాహనతోనే క్యాన్సర్ బారిన పడకుండా ఉండటం సాధ్యమవుతుందని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి పేర్కొన్నారు. చిత్తూరులోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం కాంప్రహెన్సివ్ క్యాన్సర్ కేర్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆమె మాట్లాడారు. సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, ఓరల్ క్యాన్సర్, పలు రకాల క్యాన్సర్‌పై మిడ్‌లెవల్ హెల్త్ లెవల్ ప్రొవైడర్లు, స్క్రీనింగ్ పరీక్ష విధానంపై మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఒక్కో బ్యాచ్‌కు 40 మంది చొప్పున జూలై 10వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అధికారులు హర్షవర్ధన్, శిరీష, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 16 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. బుధవారం అర్ధరాత్రి వరకు 75,068 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 33,372 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారి హుండీ కానుకలు రూ.3.48 కోట్లు లభించాయి. టైంస్లాట్ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 16 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శన భాగ్యం కలుగుతోంది.

పుష్పయాగానికి అంకురార్పణ

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం జరగనున్న స్వామి వారి పుష్పయాగానికి గురువారం సాయంత్రం 6.30 నుంచి సేనాధిపతి ఉత్సవం చేపట్టారు. అనంతరం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా శ్రీవిష్వక్సేనుల వారు ఆలయ మాడ వీధుల్లో విహరించారు. తర్వాత అంకురార్పణ కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా పూర్తిచేశారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు స్వామి, అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు పుష్పయాగం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలు రకాల పుష్పాలు, పత్రాలను స్వామివారికి నివేదిస్తారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు వీధి ఉత్సవం జరగనుంది. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

డిప్లొమా స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి రూరల్: వెంకటగిరిలోని శ్రీప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ) ఖాళీగా ఉన్న డిప్లొమా కోర్సులను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు పీకేఎం ఐఐహెచ్‌టీ ఓఎస్‌డీ ఎస్.గిరిధర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో రెండు, మూడు సంవత్సరాల లెటరల్ ఎంట్రీ (డీహెచ్‌టీడీ)కు ఈనెల 20వ తేదీన స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 9441795408, 9866169908, 9010243054 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.



ప్రత్యేక అలంకరణలో గురుదక్షిణామూర్తి

గురుదక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గురుదక్షిణామూర్తికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

– శ్రీకాళహస్తి

శ్రీవారిని దర్శించుకున్న సీఎం చంద్రబాబు

సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన నారా చంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆయన బుధవారం సాయంత్రమే తిరుమలకు చేరుకుని అక్కడే బస చేశారు. అనంతరం గురువారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం పలికారు.

– తిరుమల



తిరుమలలో సీఎం చంద్రబాబునాయుడు కుటుంబం

స్కూళ్లు తెరిచారోచ్!

- వేసవి సెలవుల అనంతరం తెరుచుకున్న బడులు
- తల్లిదండ్రులతో ఉత్సాహంగా వచ్చిన విద్యార్థులు
- తొలిరోజు 1,99,422 మంది హాజరు
- పాఠ్య, నోటు పుస్తకాలు పంపిణీ చేసిన అధికారులు

చిత్తూరు కార్పొరేషన్: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. తొలిరోజు విద్యార్థులు ఉత్సాహంగా బడులకు వచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కూళ్ల వద్దకు తీసుకువచ్చి, జాగ్రత్తలు చెబుతూ వదలి వెళ్తుండటం కనిపించింది. సెలవుల్లో ఇంటి వద్ద ఆడుతూ పాడుతూ, బంధువుల ఇళ్లకు, పార్కులకు, స్నేహితుల వద్దకు వెళ్లి ఆనందంగా గడిపారు. బడులను శుభ్రపరచి సిద్ధం చేశారు. పిల్లల కేరింతలతో స్కూళ్లలో సందడి నెలకొంది. బడిగంట మోగగానే విద్యార్థులు ప్రార్థన చేసి తరగతి గదులకు వెళ్లారు. తొలిరోజు కావడంతో కాసేపు ఉపాధ్యాయులు పిల్లలతో సరదాగా ముచ్చటించారు. సెలవుల్లో ఎలా గడిపారో తెలుసుకున్నారు. ఆ తర్వాత పాఠాలు చెప్పారు. మొత్తం మీద తొలిరోజు 90.40 శాతం విద్యార్థులు హాజరయ్యారు. అన్ని రకాల పాఠశాలల కలిపి మొత్తం జిల్లాలో 2,866 ఉన్నాయి. అందులో 2,20,600 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో 1,99,422 మంది విద్యార్థులు స్కూళ్లకు వచ్చారు.



ఉత్సాహంగా పిల్లలు



ప్రార్థన చేస్తున్న విద్యార్థులు



తరగతి గదిలో టీచర్, బాలలు

స్టూడెంట్ కిట్లు 70% పంపిణీ

జిల్లాకు 1,50,270 స్టూడెంట్ కిట్లు వచ్చాయని పాఠశాలల పునఃప్రారంభం రోజున 70% పంపిణీ చేసినట్లు అధికారులు చెప్పారు. పంపిణీ చేసిన వాటిలో టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ మాత్రమే ఉన్నాయి.



తవణంపల్లె హైస్కూల్‌లో స్టూడెంట్ కిట్ పంపిణీ చేస్తున్న ఎస్‌ఎస్‌ఏ కో-ఆర్డినేటర్ అజయ్‌కుమార్‌రెడ్డి, ఎంఈఓ



పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

విశ్రాంత ఎస్‌ఐకు సామాజిక సేవే శిక్ష

- ప్రభుత్వాస్పత్రిలో ఆరు నెలల పాటు కమ్యూనిటీ సర్వీస్ చేయాలని జడ్జిమెంట్
- యాక్సిడెంట్ కేసులో నగరి న్యాయమూర్తి వినూత్న తీర్పు



పోలీసు అదుపులో ముద్దాయి

నగరి : సాధారణంగా యాక్సిడెంట్ కేసులు కోర్టుల్లో నిరూపితమైతే న్యాయమూర్తులు జైలు శిక్ష, జరిమానా విధించడం పరిపాటి. అయితే ఇటీవల కాలంలో కొన్నిచోట్ల వినూత్నమైన శిక్షలతో న్యాయమూర్తులు నిందితులను సామాజికసేవ వైపు మరలిస్తున్నారు. ఇదే కోవలో గురువారం నగరి న్యాయమూర్తి ఓ విశ్రాంత ఎస్‌ఐకు యాక్సిడెంట్ కేసులో జరిమానా విధించడంతోపాటు సామాజిక సేవ చేయాలని తీర్పునిచ్చారు. సీఐ సురేష్, కోర్టు కానిస్టేబుల్ నవీన్ కుమార్ తెలిపిన వివరాలు..తిరుపతికి చెందిన రిటైర్డ్ ఎస్‌ఐ వెంకటరమణ తిరుత్తణికి కారులో వెళుతున్న సమయంలో నెత్తం కండ్రిగ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ వద్ద ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న కీళపట్టు బీసీ కాలనీకి చెందిన రైతు శ్రీనివాసులును ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో శ్రీనివాసులు మృతి చెందారు. 2022 ఆగస్టు 7వ తేదీ ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సంఘటనపై మృతుడి కుమారుడు పీఎస్ మహేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఏఎస్‌ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ నేపథ్యంలో నగరి జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈ కేసు గురువారం తుది విచారణకు రాగా నేరం నిరూపితమైంది. దీంతో జడ్జి విష్ణువర్మ మృతుని కుటుంబానికి రూ.పదివేలు నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఆరు నెలల పాటు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో కమ్యూనిటీ సర్వీస్ చేయాలని విశ్రాంత ఎస్‌ఐ వెంకటరమణకు శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ఎం.రామశాంతి వాదించారు. ఈ వినూత్న తీర్పు చర్చనీయాంశమైంది.

మెగా కాదు.. చోటా..!

- జిల్లాలో 500 లోపు పోస్టుల భర్తీకి మాత్రమే అవకాశం
- ఫిబ్రవరిలోనే 336 పోస్టులతో గత ప్రభుత్వం నోటిఫికేషన్
- ఎన్నికల నేపథ్యంలో ఆగిన డీఎస్సీ ప్రక్రియ
- ఇప్పుడు కొత్త డీఎస్సీ పేరిట సంతకం
- ఖాళీలపై విద్యాశాఖ కసరత్తు



చిత్తూరు జిల్లా విద్యాశాఖ కార్యాలయం

చిత్తూరు అర్బన్: ముఖ్యమంత్రి హోదాలో మెగా డీఎస్సీపై చంద్రబాబు నాయుడు సంతకం చేయడంతో జిల్లాలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీపై నిరుద్యోగులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే ఇది పేరుకు మెగా డీఎస్సీ అయినా.. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 500 లోపు మాత్రమే పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

నాలుగు నెలల క్రితమే..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో చిత్తూరు, తిరుపతి, మదనపల్లె కలిపి ఉమ్మడి జిల్లాకు సంబంధించి 336 పోస్టులను ఖాళీలుగా చూపించింది. వీటిలో స్కూల్ సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు (ఎస్జీటీ) 101, స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఏ) 97, టీజీటీ 139 చొప్పున ఖాళీలు ఉన్నాయి. వీటితో జోన్ వారీగా ఏపీ మోడల్ స్కూల్, బీసీ, సోషల్, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలతో పాటు ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లోనూ ఖాళీలు చూపించింది. మార్చి 30 నుంచి ఏప్రిల్ 30వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా.. ఎన్నికల ప్రక్రియ నేపథ్యంలో డీఎస్సీ వాయిదా వేస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. ఫలితంగా ఈ ప్రక్రియ ఆగిపోయింది. తాజాగా టీడీపీ అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీపైనే తొలిసంతకం అని హామీ ఇచ్చి, ఆ మేరకు మెగా డీఎస్సీ పేరిట ఇప్పుడు చంద్రబాబు సంతకం కూడా పెట్టారు.

ఖాళీలు చూపితే తప్పు..

పేరుకు ఇది మెగా డీఎస్సీ..కానీ పోస్టులు పెద్దగా ఉండకపోవడం వల్ల చోటా డీఎస్సీనే అని నిరుద్యోగులు భావిస్తున్నారు. పైగా జిల్లాల వారీగా విద్యాశాఖలో ఉన్న టీచర్ పోస్టుల ఖాళీలను తీసుకున్న తరువాత నోటిఫికేషన్ వెలువడటం ఆనవాయితీ. కానీ ఇప్పుడు నోటిఫికేషన్‌పై సంతకం పెట్టేశాం.. ఖాళీలు చూపండి అనే పరిస్థితి. జిల్లాలో ఎస్జీటీ, ఎస్ఏతో పాటు టీజీటీ పోస్టుల ఖాళీలపై జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించాల్సి ఉంది. నాలుగు నెలల క్రితం ఇచ్చిన నోటిఫికేషన్‌లో చూపించిన ఖాళీలకు, తాజాగా రూపొందించాల్సిన ఖాళీలకు పెద్దగా తేడా ఉండకపోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈనెలాఖరుకు గానీ ఉమ్మడి జిల్లాలో ఖాళీలపై స్పష్టత వచ్చే అవకాశం లేదు.



రథంలోని ఉత్సవమూర్తులకు మొక్కుతున్న భక్తులు

రథోత్సవం

యాదమరి(పూతలపట్టు): యాదమరి మండల కేంద్రంలోని త్రివేణి సంగమంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలలో గురువారం ఇంద్రపురి వరదరాజులస్వామి రథోత్సవం జనసందోహం నడుమ నిర్వహించారు. ఉదయం మూలస్థానంలోని శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్రవరుడికి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆ తర్వాత రథాన్ని వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. సాయంత్రం 5 గంటలకు యాదమరిలోని బ్రాహ్మణవీధిలో రథోత్సవం మొదలై రాజావీధి మీదుగా తిరిగి 6.30 గంటలకు బ్రాహ్మణవీధిలోకి వచ్చి ముగిసింది. ఈ రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తండోపతండాలుగా వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులను చెల్లించారు.

నేడు అశ్వ వాహనసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి అశ్వ వాహనంపై పురవీధుల్లో స్వామి వారు విహరిస్తారు.



యాదమరి వీధుల్లో రథోత్సవం

క్లుప్తంగా

పైపులైన్ లీకేజీతో నీరు కలుషితం

- గుర్తించిన అధికారులు
- మరమ్మతులకు ఆదేశం
- కొత్తయిండ్లులో కొనసాగుతున్న వైద్య శిబిరం



కొత్తయిండ్లులో కలుషిత నీటి సమస్యపై ఆరా తీస్తున్న అధికారులు

బైరెడ్డిపల్లె: పైపులైన్ లీకేజీ మూలాన తాగునీరు కలుషితమైనట్టు అధికారులు గుర్తించారు. మండలంలోని కొత్తయిండ్లలో కలుషిత నీరు తాగి కొంత మంది అస్వస్థతకు గురవడం విదితమే. దీంతో తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారులు మూడు రోజులుగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. బాధితులకు చికిత్స చేసి మందులు పంపిణీ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఆర్‌డబ్ల్యూఎస్‌ఈ విజయ్‌కుమార్, ఈఈ రెడ్డెయ్య, డీఈ రవికుమార్ గురువారం కొత్తయిండ్లులో పర్యటించారు. కలుషిత నీటి సమస్యపై ఆరా తీశారు. పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు కలుషితమైనట్లు పరిశీలనలో గుర్తించారు. వెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేష్, ఈఓపీఆర్డీ రాజేంద్రబాలాజి, ఆర్‌డబ్ల్యూ ఏఈ లోకనాథం, ఎంసీఓ సురేష్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంతా కల్తీమయం

జిల్లాలో ఆహార పదార్థాల కల్తీ జోరందుకుంది. పప్పు దినుసులు, టీపొడి, నూనెలు మొదలైన వాటిలో ఈ కల్తీ ఎక్కువగా ఉంటోంది. సరిహద్దు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి కల్తీ సరుకులు ఇక్కడికి దిగుమతి అవుతున్నాయి. అంతేకాకుండా ఆరోగ్యానికి హాని కలిగించే కేసరి పప్పు అమ్మకాలు వారపు సంతల్లో సాగుతున్నాయి. ఈ కల్తీ సరుకులు ఆహారంలో వినియోగిస్తే ఆరోగ్య సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అయితే కల్తీకి చెక్ పెట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

- పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా కల్తీ వస్తువులు
- పప్పులు, నూనెలు, ప్రతిదీ కల్తీయే!
- జోరుగా ప్రమాదకర కేసరి పప్పు అమ్మకాలు
- తక్కువ ధరకే విక్రయిస్తున్నారని కొంటున్న జనం
- వంట నూనెల్లో ఎముకల నూనె కల్తీ
- బోన్ ఆయిల్ పేరిట తమిళనాడు నుంచి సరఫరా
- అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్న జనం



సంతలో కల్తీ వస్తువులను సీజ్ చేస్తున్న అధికారులు (ఫైల్)



కల్తీ వస్తువులను సీజ్ చేస్తున్న అధికారులు (ఫైల్)



ప్రమాదకరమైన కేసరి పప్పు ఇదే

పలమనేరు: దుకాణాలకు వస్తున్న సరుకుల్లో ఫస్ట్ క్వాలిటీ, సెకండ్ క్వాలిటీ, ఏది అసలో, ఏది నకిలీనో స్థానిక వ్యాపారులే కనుక్కోలేకపోతున్నారు. బియ్యం మొదలు శెనగపప్పు, కందిపప్పు, చక్కెర, పెసరపప్పు, మైదాపిండి, గసగసాలు, రవ్వ, జీలకర్ర, మిరియాలు, చివరకు వంటనూనెల వరకు కల్తీ జరుగుతోంది. మిరియాల్లో బొప్పాయి గింజలు, గసగసాల్లో రవ్వ, మైదాలో చింతపిండి, నూనెల్లో పశువుల కొవ్వును కలిపి కల్తీ చేస్తున్నారు. ఈ వ్యాపారం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. స్థానికంగా దుకాణాల్లో లభించే ప్రముఖ కంపెనీల నూనె ప్యాకెట్లు ఈ ప్రాంతంలోని వారపు సంతల్లో సైతం అదే కంపెనీల నకిలీలు లభ్యమవుతున్నాయి. పైగా ధరలో కూడా భారీ తేడా ఉండడంతో ప్రజలు వీటినే కొనుగోలు చేస్తున్నారు. కల్తీ టీ పొడి కిలో కేవలం రూ.180కే దొరుకుతోంది. జిల్లాలోని పలు టీ దుకాణాల్లో కల్తీ టీ పొడినే వాడుతున్నారు. ఇక ఫాస్ట్‌ఫుడ్‌ల తయారీలో వినియోగించే వెనిగర్, సోయా సాస్, మసాలాలోనూ కల్తీ ఉన్నట్లు తెలుస్తోంది.

పామోలిన్‌లో బోన్ ఆయిల్ కలిపి..!

తమిళనాడులోని కబేళాలతో లభ్యమయ్యే ఎముకల నుంచి తయారవుతున్న నూనెలను విడిగా విక్రయించే పామోలిన్, శెనగనూనెలో కలిపి జిల్లాలోని పలు పట్టణాల్లో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నట్టు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా చిత్తూరు, నగరి, పుత్తూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు తదితర ప్రాంతాల్లో చికెన్ కబాబ్ సెంటర్లు, రోడ్లమీద కబాబ్ విక్రయించేవారు, కొన్ని హోటళ్లలో బిరియానీ, బోండా, బజ్జీలతో పాటు స్వీట్ స్టాల్స్‌లో కల్తీ నూనెలతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నట్టు తెలుస్తోంది. తమిళనాడు రాష్ట్రానికి చెందిన పలు ముఠాలు కారు చౌకగా ఈ నూనెను జిల్లాలో విక్రయిస్తున్నట్టు సమాచారం. మరీ ఘోరంగా మటన్‌లో లేగ దూడల మాంసాన్ని సైతం కలిపి విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది.

గుట్టుచప్పుడు కాకుండా కేసరి పప్పు అమ్మకాలు

జిల్లాలో ప్రమాదకర కేసరి దాల్ (లంకపప్పు) అమ్మకాలు మళ్లీ ఊపందుకున్నాయి. వీటిని తింటే పలు రకాల ఆరోగ్య సమస్యల బారిన పడక తప్పదు. ఇప్పటికే ప్రభుత్వం ఈ పప్పు అమ్మకాలను నిషేధించింది. కానీ ధర చౌకగా ఉండడంతో జనం వీటిని కొనుగోలు చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. గతంలో జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ పలమనేరులోని ఓ గోడౌన్‌లో 112 బస్తాల ప్రమాదకర కేసరి పప్పును సీజ్ చేయడం విదితమే. తమిళనాడులోని సేలం, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌ల నుంచి జిల్లాకు పెద్ద మొత్తంలో కేసరి దాల్ సరఫరా అవుతున్నట్టు తెలుస్తోంది. జిల్లాలోని పలు వారపు సంతల్లో ఈ కేసరి దాల్‌ను ఎక్కువగా విక్రయిస్తున్నారు.

పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ విభాగం

ఆహార పదార్థాల కల్తీకి చెక్ పెట్టాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు అసలు పట్టించుకోవడం లేదు. జిల్లాలో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నప్పటికీ వారు దుకాణాల వైపు దృష్టి సారించడం లేదు. ఇక సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు సోదాలు చేసే అధికారం లేకపోవడమూ ఓ కారణంగా మారింది. ప్రభుత్వం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్‌ను అమలు చేస్తున్నా ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. దీనిపై ఆహార కల్తీ నిరోధక శాఖ విచారణాధికారిగా వ్యవహరిస్తున్న జాయింట్ కలెక్టరైనా దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతోంది.

జీర్ణకోశ వ్యాధులు వస్తాయి



వంటనూనెల కల్తీతో జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. తొలుత గ్యాస్ట్రిక్‌తో ఈ సమస్య ప్రారంభమై ఆ తర్వాత తీవ్ర స్థాయికి వెళ్తుంది. కల్తీ ఆహార పదార్థాలను తిన్న వెంటనే చర్మంపై దురదలు, అలర్జీ వచ్చిందంటే వెంటనే కల్తీ పదార్థాల వల్లే జరిగినట్లు భావించవచ్చు. కల్తీ అయిన నూనెలతో తయారు చేసే ఆహార పదార్థాలను తినడం ముఖ్యంగా మధుమేహ వ్యాధి ఉన్నవారికి చాలా ప్రమాదకరం. **-డాక్టర్ మమతరాణి, ప్రభుత్వ వైద్యులు, పలమనేరు**

తరచూ దుకాణాలను తనిఖీ చేయాలి



తరచూ దుకాణాలను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేస్తే కల్తీ వస్తువుల బెడద తగ్గేది. అయితే తరచూ తనిఖీలు చేయకపోవడంతో కల్తీ అమ్మకాలు పెరగడానికి కారణమైంది. ఇలాంటి కల్తీ ఆహార పదార్థాలను తినడం ఆరోగ్యానికి మంచిది కాదు, జనంలో కూడా మార్పు రావాలి. అధికారులు చర్యలు తీసుకోవాలి.

-నరసింహులు, పీపీఎస్ కార్యదర్శి, పలమనేరు

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయం గురువారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు ముగియడంతో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న భక్తులు అటు నుంచి శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ఇందులో తమిళనాడు, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి తండోపతండాలుగా రావడంతో శ్రీకాళహస్తీశ్వరాలయం ఇసుకేస్తే రాలనంతగా నిండిపోయింది. గురువారం ఒక్కరోజే సుమారు 25 వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం ద్వారా 761 మంది, రూ.50 ప్రత్యేక దర్శనం ద్వారా 1,586 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహు–కేతు పూజలు 1,312, రూ.750 పూజలు 342, రూ.1,500 పూజలు 124, రూ.2,500 పూజలు 104, రూ.5 వేల పూజలకు 20 మంది భక్తులు చేయించుకున్నట్లు పేర్కొన్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 11,301 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.



క్యూలో వేచి ఉన్న భక్తులు

ఇంటి స్థలం కోసం ఘర్షణ

– దంపతులకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అరుణ

పుంగనూరు: ఇంటి స్థలం విషయమై ఇరువర్గాలు ఘర్షణలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని వనమలదిన్నెలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుబ్బారెడ్డి కథనం.. వనమలదిన్నెకు చెందిన శ్రీరాములు, అరుణ దంపతులకు తమ కుటుంబీకుల నుంచి ఇంటి స్థలం సంక్రమించింది. ఇలా ఉండగా ఆ స్థలాన్ని ఆక్రమించి ఇల్లు కట్టేందుకు గ్రామస్తులు గణేష్, నారాయణ ప్రయత్నించారు. అయితే శ్రీరాములు దంపతులు వారిని అడ్డుకోవడంతో వారిపై కర్రలు, రాళ్లతో గణేష్, నారాయణ దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంటలపై ఆగని ఏనుగుల దాడి

పులిచెర్ల(కల్లూరు): మండలంలో పంటలపై ఏనుగుల దాడి కొనసాగుతూనే ఉంది. గురువారం తెల్లవారు జామున సైతం మరోసారి పంటలపై స్వైరవిహారం చేశాయి. ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లె సమీపంలోని అరటి, మామిడి తోటల్లో ప్రవేశించి నష్టం కలిగించాయి. చేతి కొచ్చిన పంటలు ఏనుగుల దాడిలో దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. అటవీ అధికారులు ఏనుగులను కట్టడి చేసి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్ట్

– 25 లక్షల విలువ చేసే సొత్తు స్వాధీనం

తిరుపతి క్రైమ్: జిల్లాలో అంతర్రాష్ట్ర దోపిడీ దొంగలను పోలీసులు అరెస్ట్ చేసినట్లు క్రైమ్ డీఎస్పీ రవికుమార్ తెలిపారు. పోలీసుల కథనం.. జిల్లా పరిధిలోని తిరుపతి రూరల్, చంద్రగిరి, అలిపిరి, రేణిగుంట, నారాయణవనం, వెంకటగిరి, చిత్తూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో తమిళనాడుకు చెందిన మహేష్ మణికంఠ, వెస్ట్ గోదావరికి చెందిన షేక్‌అలీమొహమ్మద్దీ దొంగతనాలకు పాల్పడేవారు. వీరిపై ఆయా పోలీస్ స్టేషన్లలో 11 కేసులు నమోదయ్యాయి. వీరిని తిరుపతి పరిసర ప్రాంతాల్లో తచ్చాడుతుండగా గురువారం పోలీసులు అరెస్ట్ చేశారు. ముద్దాయి మహేష్ మణికంఠపై రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 50కి పైగా కేసులున్నాయి. అదేవిధంగా షేక్‌అలీమొహిద్దీన్‌పై 40కి పైగా కేసులు నమోదైనట్లు పోలీసులు గుర్తించారు. వీరు రక్కీ నిర్వహించి దోపిడీలకు పాల్పడేవారు. అదేవిధంగా తాళం వేసి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడేవారు. వీరి వద్ద నుంచి రూ.25 లక్షల విలువ చేసే 400 గ్రాముల బంగారు, 2.25 కిలోల వెండి, ఒక టీవీని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన వారికి రివార్డులు మంజూరు చేస్తామని డీఎస్పీ తెలిపారు.

ఘనంగా ప్రారంభమైన రైతు మేళా



నాబార్డ్ రైతు ఉత్పత్తుల మేళా ప్రారంభోత్సవంలో పలువురు ప్రముఖులు, నాబార్డ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: నాబార్డ్ ఆంధ్రప్రదేశ్ రీజినల్ శాఖ ఆధ్వర్యంలో నాబార్డ్ చిత్తూరు డీడీఎం సునీల్ పర్యవేక్షణలో మహతి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన తరంగ్ నాబార్డ్ రైతు ఉత్పత్తుల మేళా గురువారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి నాబార్డ్ ఏపీ ఆర్‌వో జనరల్ మేనేజర్ డాక్టర్ కేవీఎస్.ప్రసాద్, డీజీఎం సీఆర్.అబువరాజన్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ ఏఎస్ఎన్.ప్రసాద్, రాస్ ఈడీ వెంకటరత్నంనాయుడు, మెప్మా పీడా స్మితి రాధమ్మ, డీఆర్‌డీఏ పీడీ స్మితి ప్రభావతి, ఆర్ఏఆర్ఎస్ఏడీఆర్ డాక్టర్ సి.రమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకర్‌రెడ్డి, డీసీసీబీ సీఈవో మనోహర్‌గౌడ్ పాల్గొని మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేవీఎస్.ప్రసాద్ రైతుల సంఘటితతను ప్రోత్సహించడంలో ఎఫ్‌పీవోఎస్ కీలక పాత్రను వివరించారు. నాబార్డ్ రైతాంగానికి చేస్తున్న సహకారం, ఈ ప్రదర్శన ద్వారా వారు పొందే లాభాలను తెలియజేశారు. వినియోగదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఎఫ్‌పీవోఎస్ తమ ఉత్పత్తులను మెరుగు పరచాలని సూచించారు. ఓఎన్‌డీసీ వంటి ఆన్‌లైన్ ప్లాట్ ఫారమ్‌లలో చేరి, ఎఫ్‌పీవోఎస్ తమ మార్కెట్ పరిధిని విస్తరించవచ్చన్నారు. నాబార్డ్ డీడీఎం సునీల్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో సుమారు 40 స్టాల్స్ ఉన్నాయని, సేంద్రీయ పండ్లు, బియ్యం, బెల్లం, కూరగాయలు, తేనె, ఊరగాయలు, పొడులు, జీడి పప్పు, జూట్ ఉత్పత్తులు, చింతపండు, కొబ్బరి ఉత్పత్తులు వంటివి అందుబాటు ఉన్నాయన్నారు. అంతేగాక రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి కళాత్మ క చెక్క పనులు, కలంకారి ఉత్పత్తులు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేళాలో చిత్తూరు డీసీసీబీ మొబైల్ ఏటీఎం వ్యాన్ సులభంగా ఆర్థిక సేవలను అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. కెనరా బ్యాంక్, సప్తగిరి బ్యాంక్ ప్రతినిధులకి క్రెడిట్ లింకేజెస్ సులభతరం చేస్తున్నట్లు తెలిపారు. అదనంగా నింజాకార్ట్ అప్లికేషన్ సహాయంతో ఎఫ్‌పీవోఎస్, ఓఎఫ్‌పీవోస్ తమ ఉత్పత్తులను డిజిటల్ మార్కెట్‌లో ఓఎన్‌డీసీ పోర్టల్‌పై తమ ఉత్పత్తులను ప్రదర్శింపజేస్తున్నట్టు వెల్లడించారు. గురు, శుక్ర, శనివారం మూడు రోజుల పాటు జరిగే ఈ మేళాను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రొఫెసర్ డాక్టర్ సత్యగోపాల్, కెనరా బ్యాంక్ ఆర్ఎం నాగరాజు, తిరుపతి ఎల్‌డీఎం విశ్వనాథరెడ్డి, చిత్తూరు ఎల్‌డీఎం హరీష్, రోటరీ క్లబ్ ప్రతినిధి హేమచంద్ర, కేవీకే కరకంబాడి ప్రిన్సిపల్, సైంటిస్ట శ్రీనివాస్ హాజరయ్యారు.

'భౌ..భౌ..ఎక్కడో..?

- ఆచూకీ చెబితే నజరానా
- చోరీ అయిన శునకాల కోసం అన్వేషణ
- సామాజిక మాధ్యమాల్లో వైరల్

పలమనేరు: పెంపుడు జంతువులంటే ఇష్టపడని వారంటూ ఉండరు. కొందరైతే తమ ఇంట్లోని మనుషుల కంటే వాటినే ఎక్కువగా ప్రేమిస్తూ ఉంటారు. వాటితో విడదీయరాని బంధం కలిగి ఉంటారు. అలా ఎంతో అపురూపంగా పెంచుకుంటున్న శునకాలు కనిపించకపోతే..? వాటి యజమానుల బాధ చెప్పనలవి కాదు. శునకాలతో అలాంటి బంధం కలిగి ఉన్న ఓ వ్యక్తి తనకు ప్రియమైన శునకాలు చోరీకి గురి కావడంతో నిద్రాహారాలు మాని వాటి కోసం అన్వేషిస్తున్నాడు. సామాజిక మాధ్యమాల్లో వాటి గురించి పెట్టడంతో ఇది కాస్తా వైరల్ అయ్యింది. వివరాలు.. పలమనేరు పట్టణ సమీపంలోని గంటావూరు ఫ్లైఓవర్ వద్ద నరేష్ అనే జంతు ప్రేమికుడు కాపురముంటున్నాడు. ఆయనకు అరుదైన జాతి కుక్కలంటే ఇష్టం. భారత ప్రధాని నరేంద్రమోదీ వద్ద సెక్యూరిటీ వింగ్‌లో ముదోల్ హౌండ్ జాతి శునకాలు ఉన్నాయని, అంతేకాకుండా ఆర్మీలో సైతం సైతం ఇలాంటి జాతి కుక్కలున్నాయని తెలుసుకున్నాడు. దీంతో అవి ఎక్కడ లభిస్తాయో తెలుసుకునేందుకు సోషల్ మీడియాలో తెగ అన్వేషించాడు. ఎట్టకేలకు మహబూబ్‌నగర్ జిల్లాలోని ఓ బ్రీడర్ వద్ద నెలవయసున్న ఓ మగ, మరో ఆడ ముదోల్‌హౌండ్ జాతి పెట్స్(కుక్కపిల్లలను) రూ.25వేలు ఇచ్చి కొన్నాడు. 15రోజులుగా వాటిని ఇంట్లో అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నాడు. ఇవి అత్యంత విశ్వాసమైన కుక్కలు కావడంతో కుటుంబీకులతో బాగా కలిసిపోయాయి. ముద్దుగా మగ శునకానికి మాక్స్ అని, ఆడ శునకానికి మ్యాగీ అని పేర్లు పెట్టుకున్నారు. ఇవి విలువైనవి కావడంతో వీటికోసం ఇంటి వద్ద సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశాడు. ఇది ఆనోటా ఈనోటా పట్టణంలోకి పాకింది. దీంతో వీటిపై చోరుల కన్ను పడింది. నరేష్ ఇంట లేనప్పుడు ఆయన తల్లి ఇంట్లో ఉండగా కుక్కపిల్లలు ఇంటివెనుక ఉన్నప్పుడు ఎవరో చాకచక్యంగా పట్టుకుపోయారు. ఇంటికొచ్చాక కుక్క పిల్లలు కనిపించకపోవడంతో నరేష్ హతాశుడయ్యాడు. వాటి ఆచూకీ కోసం సీసీ కెమెరా పుటేజీని సైతం పరిశీలించాడు. కెమెరాలేని ప్రాంతంలోకి కుక్కపిల్లలు వెళ్లినపుడు వీటిని చోరీ చేసినట్టు అతనికి అర్థమైంది. వెంటనే ఫేస్‌బుక్, ఇన్‌స్టా, వాట్సాప్, యూట్యూబ్ ఛానెళ్లలో కుక్కపిల్లల చోరీని వివరించాడు. కుక్క పిల్లల ఆచూకీ తెలిపిన వారికి నజరానా సైతం ప్రకటించారు. స్థానిక మీడియా, సోషల్ మీడియాలో ఇప్పుడు ఈ కుక్కల చోరీ విషయం ట్రెండ్ అవుతోంది. మరోవైపు స్థానిక పోలీసులను సైతం ఆశ్రయించాడు.

పుంగనూరులో తేలిన కుక్క పిల్లలు?

ఇలా ఉండగా పుంగనూరుకు చెందిన ఓ వ్యక్తి తన స్టేటస్‌లో ఈ కుక్కపిల్లలను పెట్టి ఉండటం గమనించిన కొందరు నరేష్‌కు సమాచారాన్ని చేరవేశారు. దీని ఆధారంగా పలమనేరు పోలీసులను వెంటబెట్టుకుని కుక్కపిల్లల యజమాని పుంగనూరులో వాటికోసం ఆరా తీస్తున్నారు. నరేష్ 'సాక్షి'తో మాట్లాడుతూ, ఖరీదైన కుక్కపిల్లలను చోరీ చేసే గ్యాంగ్ పలమనేరులో ఉందని, ఆ గ్యాంగే తన పిల్లలను చోరీ చేసి విక్రయించి ఉంటుందేమోనని అనుమానం వ్యక్తం చేశారు. తన కుక్కపిల్లలను పోలీసుల సాయంతో పట్టుకుంటానిని ఆశాభావం వ్యక్తం చేశారు. మొత్తం మీద చోరీకి గురైన కుక్క పిల్లలు ప్రస్తుతం పుంగనూరులో ఉన్నట్టు తేలింది.

